నోటీస్ బోర్డు

• నేడు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ

కార్వేటినగరం : ఆయిల్ పామ్ సాగుపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారి లోకేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు సమావేశ భవనంలో మధ్యాహ్నం 2.30 గంటలకు రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఉద్యానశాఖ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

నింద్ర: మండలంలోని రైతులకు నేడు ఆయిల్ పామ్ తోటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యానవన శాఖాధికారి లోకేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ హాలులో జరిగే శిక్షణ కార్యక్రమానికి రైతులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

అర్హులకే పొజిషన్ సర్టిఫికెట్



హౌసింగ్, రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం : మండల పరిధిలో కొత్తగా ఇల్లు మంజూరు ఉంటేనే పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అర్హులకే పొజిషన్ సర్టిఫికెట్ సిఫార్సు చేయాలన్నారు. వీఆర్ఓలు తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత సర్టిఫికెట్లు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ దాము, సూపర్‌వైజర్ బాబు, వీఆర్ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాట గంగమ్మకు పూజలు



అంబలి, పూజాసామగ్రి తీసుకొస్తున్న భక్తులు

ఏట్టుకూరిపల్లె : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటూకూరిపల్లె గ్రామంలో వెలసిన బాట గంగమ్మకు కొలువు మహోత్సవాలలో భాగంగా మంగళవారం పొంగళ్లు, అంబలి సమర్పించారు. మధ్యాహ్నం పాల బిందెలతో ఊరేగించి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



బజారువీధిలో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న లోకేష్ తదితరులు

చిత్తూరు అర్బన్: పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా కూడా నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటికే రియల్ టైమ్ గవర్నెన్స్‌లో కార్పొరేషన్ వాహనాల పనితీరును నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధుల్లో చెత్త తీసే వాహనాలు ఏయే సమయాల్లో ఎక్కడ ఉంటాయనే వివరాలను ఆయా తెలియచేయడానికి ఆయా వార్డుల్లో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. జియో ట్యాగింగ్, జీపీఎస్ ద్వారా వాహనాలను నిత్యం మొబైల్‌లోనే పర్యవేక్షిస్తామని, అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. మరోవైపు నగరంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగజాతర నేపథ్యంలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనుల ఏర్పాట్లను ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పరిశీలించారు. బజారువీధిలో వ్యర్థాలు తొలగించడం, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చేయాల్సిన పనులపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు మంగళవారం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన ఆర్డీఓతో మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత 9 రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీహెచ్‌ఓలకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే మినహాయించాలన్నారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వెంటనే సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. క్లినిక్‌లకు అద్దెలు చెల్లించాలని తెలిపారు. 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పునరుద్ధరించి ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. జాబ్‌చార్ట్ ఇవ్వాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ సలహాదారులు మణి, నాయకులు బాలాజీరావు, కుమారి, సురేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట





పుత్తూరు, నగరి పట్టణాల్లో మధ్యాహ్నం వరకు ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రం నల్లటి మేఘాలు కమ్ముకొని పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండు వేసవిలో వర్షం కురవడంతో కొంతమేరకు ప్రజలకు ఉపశమనం కలిగింది. కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడడం వల్ల విద్యుత్ అంతరాయం కలిగింది. మరికొన్ని చోట్ల వరిపైరు నేలకొరగడం, మామిడి పంట నేల రాలడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కేబీఆర్ పురం తడుకు గ్రామాల వద్ద వడగండ్ల వర్షం కురిసినట్లు గ్రామస్తులు తెలిపారు. నెల రోజులకు పైగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జనం ఎండ ధాటికి ఇబ్బందులు పడ్డారు. అయితే మంగళవారం సాయంత్రం రెండు గంటలకు పైగా కురిసిన జోరువర్షంతో వాతావరణం కాస్త చల్లగా మారింది. అకస్మాత్తుగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు, ఆపై భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించడంతో పాటు రోడ్లపై వర్షపు నీరు పారింది. వేసవి తీవ్రతకు అల్లాడిపోయిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది.

- పుత్తూరు/నగరి

తొలగిస్తారా!.. తొలగించమంటారా?

• సుందరయ్యనగర్‌లో అక్రమ నిర్మాణంపై ఆందోళన
• 24 గంటలే గడువు.. ఆపై మేమే రంగంలోకి దిగుతాం
• రెవెన్యూ శాఖకు లబ్ధిదారుల అల్టిమేటం



అక్రమ నిర్మాణం వద్ద మహిళల ఆందోళన

పుత్తూరు: మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన సుందరయ్యనగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణం వద్ద మంగళవారం స్థానిక లబ్ధిదారులైన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అక్రమ నిర్మాణంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఆగ్రహించారు. రెవెన్యూ అధికారులే బుధవారం సాయంత్రంలోపు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని, లేనిపక్షంలో గురువారం తామే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామంటూ హెచ్చరించారు.

హైకోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ..

అక్రమ నిర్మాణంపై లబ్ధిదారులైన హేమలత, జ్యోతి మాట్లాడుతూ 2009లో నాటి ప్రభుత్వం నేసనూరు రెవెన్యూ లెక్కదాఖలా 186/8, 9 లోని 2.65 ఎకరాల విస్తీర్ణంలో 172 మంది నిరుపేదలైన తమకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా మరికొందరు ప్రభుత్వమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని ఆశించారని తెలిపారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇదే సుందరయ్యనగర్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు ఇక్కడ సర్వే చేపట్టడంతో తాము 2017లో హైకోర్టు నుంచి స్టేటస్‌కో తీసుకొచ్చామని వెల్లడించారు. అప్పటి నుంచి నేటి వరకు స్టేటస్‌కో కొనసాగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల 20వ తేదీ నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ వ్యక్తి తమకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడని తెలిపారు. సదరు స్థలంపై స్టేటస్‌కో సైతం ఉన్నప్పుడు అక్రమంగా నిర్మాణం ఎలా చేపడతారంటూ ప్రశ్నించారు. ఇదే విషయాన్ని గత నెలలోనే రెవెన్యూ అధికారులకు తెలియజేసినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఇక్కడ ఏమి జరిగినా రెవెన్యూ అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు.

కానరాని సంక్షేమం

కూటమి ప్రభుత్వం పాలనలో పనులు లేక కూలీలు, చిరు వ్యాపారులకు పెట్టుబడులు దొరక్క... సంక్షేమ పథకాలు అందక ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం రాక.. పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు యంత్రాలతో చేస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు చేతి నిండా పని దొరకని పరిస్థితి. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారం కాగా.. పిల్లలు చదువులు, వైద్యం ఇతర ఖర్చులకు అప్పుల బాట పడుతున్నారు.

– కార్వేటినగరం



పింఛన్ కోసం పండుటాకుల పడిగాపులు (ఫైల్)

పేదలకు అప్పుల తిప్పలు

• పనులు లేక.. అప్పుల పాలు
• విద్య, వైద్యానికి వడ్డీ వ్యాపారులే దిక్కు
• నామమాత్రంగానే కార్పొరేషన్ రుణాలు
• పథకాలపై కూటమి కత్తి
• గత ఐదేళ్లలో సంక్షేమ పరవళ్లు

ప్రభుత్వం నుంచి సంక్షేమం అందక కుటుంబ పోషణకు, డ్వాక్రా రుణాల చెల్లింపునకు మహిళలు ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. ప్రైవేటు బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజు డాక్యుమెంట్ల ఖర్చు, బీమా తదితరాల కింద 10 శాతం రుణంలో మినహాయించుకుని ఇస్తున్నారు. వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. 2014లో చంద్రబాబు పాలనలోనూ ఇదే తరహా పరిస్థితులు ఎదురయ్యాయి. అప్పట్లో చాలా మంది ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వేధింపులు, కాల్‌మనీ వ్యవహారంలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు పేదలకు కేవలం డ్వాక్రా రుణాలతోనే సరిపెడుతున్నాయి.

కంటి తుడుపు కార్పొరేషన్ రుణాలు

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నామ మాత్రంగా బీసీ, ఎస్సీ, కాపు కార్పొరేషన్ రుణాల పేరిట గ్రామం, వార్డుకు ఇద్దరు ముగ్గురికి చొప్పున రుణాలు ఇచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. దీంతో అర్హులకు రుణాలు అందని పరిస్థితి.

గతంలో క్రమం తప్పకుండా సాయం

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు క్రమం తప్పకుండా సంక్షేమ పథకాల లబ్ధి అందింది. ముఖ్యంగా మహిళల పేరిట పథకాలను అమలు చేయడంతో కుటుంబ జీవనానికి, పిల్లల చదువులకు ఇబ్బందులు ఉండేవి కావు. కరోనా విపత్తు సమయంలోనూ రెండేళ్ల పాటు సంక్షేమ పథకాలు ఎన్నో పేద కుటుంబాల జీవనానికి భరోసాగా నిలిచాయి. వైఎస్ఆర్ చేయూత, ఆసరా(డ్వాక్రా రుణమాఫీ), అమ్మఒడి, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, పథకాల సహాయంతో ఎందరో మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. పిల్లల స్కూల్, కళాశాల ఫీజులు, వైద్యఖర్చులు కూడా నాటి ప్రభుత్వం భరించడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం ఉండేది కాదు. దీంతో వారు అప్పులు చేసే పరిస్థితులు లేవు. అయితే ప్రస్తుతం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది.

• శ్రీరంగరాజపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ కుటుంబం పిల్లల ఫీజులు, డ్వాక్రా రుణాల చెల్లింపుల కోసం ప్రైవేటు బ్యాంకు వద్ద రూ.50 వేలు రుణం తీసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక కొరతతో కొన్ని నెలలు భవన నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు సరిగా లేక జీవనం కష్టంగా మారింది. ఈ పరిస్థితిలో వారం వారం బ్యాంకు వాయిదాలు సరిగా చెల్లించక పోవడంతో బ్యాంకు సిబ్బంది ఒత్తిళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కుటుంబాలు జిల్లాలో వందలాదిగా ఉన్నాయి.

పథకాలు అందక చితికిన జీవనం

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జిల్లాలోని 32 మండలాల్లో 822 రెవెన్యూ గ్రామాలు, 697 గ్రామ పంచాయతీలు, ఒక నగరపాలక సంస్థ, నాలుగు మున్సిపాలిటీలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 18.73 లక్షల జనాభా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా సంక్షేమ పథకాలు అందక ప్రజల జీవితాలు చితికి పోతున్నాయి.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. కేవలం పింఛన్ పెంపు హామీ మినహా మిగిలినవి అటకెక్కించింది. దీంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయింది. వ్యాపారాలు కూడా అంతంతమాత్రంగా సాగుతున్నాయి. ప్రధానంగా మహిళలకు ఎలాంటి పథకాలు అందడం లేదు.

పరిశుభ్రతపై కిశోరి బాలికలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్నా సీడీపీఓ కృష్ణవేణి

నగరి : వ్యక్తిగత శుభ్రత, సంపూర్ణ ఆరోగ్యానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై కిశోరి బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎంపీపీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి పలు అంశాలపై కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. జూన్ 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఏఎన్ఎం శాంతి ద్వారా ఆరోగ్య అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మహిళా శక్తి కేంద్రాల వారు బాల్యవివాహాల నిర్మూలన, ఆత్మరక్షణ, వృత్తి విద్య ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎం శాంతి, ఎంఎస్‌కేలు శైలజ, లక్ష్మి, లక్ష్మీప్రసన్న, సరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం సద్వినియోగం చేసుకోండి

నింద్ర: కిశోరి వికాసం కార్యక్రమాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. మండలంలోని ఇరుగువాయి గ్రామంలో మంగవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కృష్ణవేణి మట్లాడుతూ 10నుంచి 19 ఏళ్ల బాలికలు కిశోరి వికాసం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. దీని కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాస్ మునిరత్నం సేవలు ఆదర్శనీయం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, డాక్టర్



మునిరత్నం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వృద్ధులు

పుత్తూరు: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం సేవలు ఆదర్శనీయమని శంకర నేత్రాలయ ప్రతినిధి వెంకటముని పేర్కొన్నారు. స్థానిక రాస్ కార్యాలయంలో మంగళవారం మునిరత్నం నాలుగో వర్ధంతిని సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటముని మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం అహర్నిశలు పాటుపడ్డ వ్యక్తి మునిరత్నం అని కొనియాడారు. ఆయన పేరిట ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో 3 నెలల ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన 40 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ అధికారి హరి, రాస్ అధికారి రవి, తేజ, మునిశేఖర్, ప్రకాష్, ఏకాంబరం, మణి తదితరులు పాల్గొన్నారు.

మునిరత్నం సేవలు చిరస్మరణీయం

కార్వేటినగరం : రాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ గుత్తా మునిరత్నం నాలుగో వర్ధంతిని కార్వేటినగరం రాస్ వృద్ధాశ్రమంలో మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ మాట్లాడుతూ.. పేదలు, అనాథల పట్ల సేవా దృక్పథం కలిగిన వ్యక్తి డాక్టర్. మునిరత్నం అని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

తమిళనాడు చెక్‌పోస్టుల్లో వేధింపులు



నిరసన తెలుపుతున్న ట్యాక్సీ డ్రైవర్లు

నగరి : పట్టణం నుంచి తమిళనాడుకు వెళ్లే ట్యాక్సీలను ఆ చెక్‌పోస్టుల్లో వేధిస్తున్నారని మామూళ్లు ఇస్తేనే వదిలిపెడుతున్నారని మంగళవారం ట్యాక్సీ డ్రైవర్లు సీపీఐ ఆధ్వర్యంలో సరిహద్దు ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద నిరసన వ్యక్తం చేశారు. పార్టీ టౌన్ సెక్రటరీలు వేలన్, బాషా మాట్లాడుతూ నగరి నుంచి తమిళనాడుకు ట్యాక్సీలు వెళుతుంటాయని వాటి రికార్డులు సక్రమంగా ఉన్నా వెనుక నుంచి నంబర్ ప్లేట్ ఫొటో తీసి జరిమానా వేస్తున్నారని పేర్కొన్నారు. మామూళ్లు ఇస్తే వదిలిపెడుతున్నారని చెప్పారు. ట్యాక్సీలపై ఆధారపడి బతుకుతున్న ట్యాక్సీ డ్రైవర్లు, ఓనర్లు పలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు ఈ విషయంలో స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్యాక్సీ ఓనర్లు ధన, హరి, తులసి బాబు, కామరాజ్, కిషోర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఓందేవి జయంతి





ఆలయంలో నిర్వహిస్తున్న యాగపూజలు, ప్రత్యేక అలంకరణలో శ్రీ ఓందేవి

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో ఉన్న త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో శ్రీ ఓందేవి జయంతిని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఓం పంచవటి పీఠాధి పతి జగద్గురు స్వామి జ్ఞాన శక్తియేంద్ర స్వామి సూచనల మేరకు ఆలయంలో వేదపండితులు యాగశాల పూజలను చేపట్టారు. ఆలయంలోని శ్రీ ఓం దేవికి ప్రత్యేక అభిషేకాలు చేసి పుష్పాలతోను, పట్టువస్త్రాలతోను అలంకరించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని కర్పూర హారతులు పట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్య స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

నగరి : ఎన్నికల సమయంలో కూటమి ఆశాలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపేట, సత్రవాడ అర్బన్ యూపీఎస్‌ల వైద్యాధికారులకు డిమాండ్లు నెరవేర్చాలంటూ వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఉషారాణి, యూనియన్ నాయకులు రుక్మిణి, నీరజ, గీత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఆశా కార్యకర్తలకు గ్రాట్యువిటీ కింద రూ. 50,000 ఇస్తామని, వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతామని, మెటర్నిటీ లీవుల కింద 180 రోజులు ఇస్తామని ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఆ హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పవిత్ర, నాయకులు మమతా ప్రియ, మీనా పాల్గొన్నారు.

వేసవిలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : వేసవిలో గర్భిణులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారి మోహన్ క్రిష్ణ సూచించారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల సమక్షంలో సమావేశం నిర్వహించారు. వేసవిలో ముఖ్యంగా గర్భిణులు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వడదెబ్బకు గురైనట్లు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం వడదెబ్బ జాగ్రత్తలపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.